సాక్షి పెద్దపల్లి

సోమవారం, 30, సెప్టెంబర్, 2024

హిందీ భాష అమలుకు కృషి

జ్యోతినగర్(రామగుండం): మనదేశ ఏకీకృత భాష హిందీ అని, రాజ్యభాష అమలుకు ఎన్టీపీసీ కృషి చేస్తోందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన హిందీ భాషా పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజువారీ అధికారిక పనిలో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. హిందీగొప్ప సాంస్కృతిక భాష అని, వారసత్వంతో అందరూ ఆదరించి నేటితరానికి భాష నేర్పించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.



విజేతకు బహుమతులను అందిస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు తదితరులు

న్యూస్‌రీల్

జిల్లాలో 20 వేల సభ్యత్వాలు నమోదు



సభ్యత్వం చేయిస్తున్న క్యాతం వెంకటరమణ

గోదావరిఖని: జిల్లాలో ఇప్పటివరకు బీజేపీ 20 వేల సభ్యత్వాలు పూర్తిచేసిందని ఆ పార్టీ సభ్యత్వ జిల్లా ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పాగా వేస్తుందన్నారు. అత్యధిక సభ్యత్వం ద్వారా బలమైన పార్టీగా బీజేపీ ఆవిర్భవిస్తుందని అన్నారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో కమిటీల ద్వారా సభ్యత్వం నమోదు చేస్తున్నామని వివరించారు. లక్ష మంది ప్రజలను సభ్యులుగా చేర్చే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన అన్నా రు. సభ్యత్వ నమోదులో ప్రతినిధులు కోడూరి రమేశ్, అపర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి విద్యార్థిని ఎంపిక



శ్వేత సంజన

గోదావరిఖనిటౌన్: స్థానిక విద్యానగర్‌కు చెందిన శ్వేత సంజన ప్రతిష్ఠాత్మక కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు దక్కించుకుంది. గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన పేదింటి సలిగంటి సదానందం – రజిత దంపతుల కూతురు శ్వేత సంజన.. ఇటీవల సెంట్రల్ యూనివర్సిటీ విడుదల చేసిన కామన్ ఎంట్రన్స్ సీయూసెట్ పీజీ పరీక్ష ఫలితాల్లో ఎస్సీ కేటగిరీలో 85వ ర్యాంకు సాధించింది. కేరళ రాష్ట్రంలోని కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీలో జీనోమిక్ సైన్స్ గ్రూప్‌లో సీటు దక్కించుకుంది. శ్వేత సంజన చిన్నతనం నుంచి చదువులో ముందువరుసలో ఉంది. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గురుకులంలో పదో తరగతి, మల్లాపూర్ గురుకులంలో ఇంటర్, ఘట్‌కేసరి గురుకుల కళాశాలలో మైక్రో బయాలజీ డిగ్రీ పూర్తి చేసింది. విద్యార్థినిని తల్లిదండ్రులతో పాటు విద్యాభిమానులు అభినందించారు.


పీఎల్ఆర్ బోనస్‌పై సింగరేణి కార్మికుల హర్షం

గోదావరిఖని: దేశంలోని బొగ్గుగని కార్మికుల ఫెర్మార్మెన్స్ లింక్‌డ్ రివార్డ్(పీఎల్ఆర్) బోనస్‌పై ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన చర్చలు సఫలం కావడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోల్‌ఇండియా యాజమాన్యం, కార్మిక సంఘాల నేతలు ఇందులో పాల్గొన్నారు. యూనియన్లు సంయుక్తంగా ఒక్కో కార్మికునికి ఈఏడాది రూ. 1.50 లక్షలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంయుక్త ప్రతిపాదనను యాజమాన్యం ముందు ఉంచాయి. కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సింగరేణి నుంచి బీఎంఎస్, హెచ్ఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, రియాజ్ అహ్మద్ హాజరయ్యారు. అయితే, ఒక్కో కార్మికుడికి బోనస్ రూ.93,750 చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. గతేడాది పీఎల్ఆర్ బోనస్ కింద రూ.85వేలు చెల్లించారు.

విధులు విస్మరిస్తే చర్యలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్, యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, విధులను విస్మరిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు హెచ్చరించారు. నాలుగు వారాలుగా గూగుల్ ఫారం ద్వారా రోజూ 2,300 మంది బోధన, బోధ నేతర సిబ్బందిని పర్యవేక్షిస్తున్నామన్నారు. వీరి విధులపై సంక్షిప్త నివేదికను కలెక్టర్‌కు అందిస్తున్నామన్నారు. జిల్లాలో పాఠశాలల పర్యవేక్షణ రాష్ట్రానికే ఆదర్శంగా ఉందని అన్నారు. ఈ విధానం ద్వారా సెలవులో ఉన్న సిబ్బంది తప్ప మిగతా వారంతా ప్రార్థన సమయానికల్లా హాజరై 30వేల మంది విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నారని ఇన్‌చార్జి డీఈవో వివరించారు.

పట్టభద్రులతో సమావేశం



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పట్టభద్రులు

ధర్మారం(ధర్మపురి): పట్టభద్రుల ఎమ్మెల్సీ పుట్కూరి నరేందర్‌రెడ్డి ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పట్టభద్రులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే నిరుద్యోగ, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు జైన సురేశ్‌కుమార్, మహేందర్, కుమార్, దేవి అంజయ్య పాల్గొన్నారు.

రుణమాఫీకి నిరీక్షణ

- 3 వేల మంది బ్యాంకు ఖాతాలు గల్లంతు
- ఆధార్ నంబరులేనివి 2,085 అకౌంట్లు
- పెండింగ్‌లో 1,993 మంది దరఖాస్తులు
- నిరీక్షిస్తున్న 12,196 మంది అన్నదాతలు
- జిల్లాలో రుణమాఫీ పథకం అమలు తీరు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

పెద్దపల్లిరూరల్: రుణమాఫీ అవుతుందో లేదో? మాఫీ అయ్యేందుకు అర్హతలు ఉన్నా ఏదో ఓ కారణంతో తమకు లబ్ధి చేకూరడం లేదనే ఆందోళనతో ఉన్న జిల్లాలోని పలువురు అన్నదాతలు.. ఎప్పుడు రుణమాఫీ అవుతుందోనని ఎంతోఆశతో ఎదురుచూస్తున్నారు. అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తింజేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తున్నా.. ఇంకా ఆచరణకు నోచడం లేదని అంటున్నారు. రుణమాఫీ వర్తించని రైతులు బ్యాంకులు, మండల వ్యవసాయాధికారి ఆఫీసుల చుట్టూ తిరితిరిగి వేసారి పోయారు. రైతువేదికల్లో దరఖాస్తులు అందించినా.. ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో 17,281 మంది దూరం..

జిల్లాలో రుణమాఫీకి 17,281 మంది దూరంగా ఉండిపోయారు. ఇందులో 12,196 మంది రైతులు ఆయా మండలాల పరిధిలోని రైతువేదికల్లో ఉన్న ఏఈవోలు, ఇతర వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేశారు. వారిలో 10,203 మంది అన్నదాతల వివరాలు సక్రమంగా ఉండడంతో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మరో 1,993 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. వీరిలో రూ.2లక్షల కన్నా ఎక్కువ రుణం పొందిన వారితోపాటు రూ.ఒకలక్ష, రూ.50వేలు పొంది రుణమాఫీ కాని రైతులు కూడా ఉన్నారు. రూ.2లక్షలకు మించి ఉన్న కుటుంబాలకు సంబంధించి కుటుంబసభ్యుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

3 వేల ఖాతాలు మిస్సింగ్..!

జిల్లా వ్యాప్తంగా ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు పొందిన 3 వేల మంది రైతుల బ్యాంకు ఖాతాలు మిస్సయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఆయా రైతులకు సంబంధించిన వివరాలు లభ్యం కాకపోవడం కూడా ఒక కారణంగా వారు పేర్కొంటున్నారు. అయితే బ్యాంకుకు సంబంధించిన లావాదేవీల్లో సాంకేతిక సమస్యలతోనే ఇలా రైతుల ఖాతాలు గల్లంతైనట్లు చెబుతున్నారు. బ్యాంకు అధికారులు సాఫ్ట్‌వేర్‌ను పునరుద్ధరించి వ్యవసాయశాఖకు నివేదిస్తేనే రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా మరో 2,085మంది రైతులు రుణం పొందినట్లు ఉన్నా వారి ఆధార్ నంబర్లు లేనికారణంగా మాఫీ వర్తించడం లేదు. అందుకు సంబంధించిన రైతుల కోసం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

రైతు రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో రుణమాఫీ వర్తించని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. కుటుంబ సభ్యుల గ్రూపింగ్ ప్రక్రియ పూర్తిచేశాం. ఇండియన్ బ్యాంకులో తలెత్తిన సాంకేతిక లోపంతో 3 వేలమంది రైతుల ఖాతాలు గల్లంతయ్యాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

రైతుల అభ్యున్నతికి 'విండో'ల కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు, వేదికపై ప్రతినిధులు వేణుగోపాల్‌రావు, మల్లారెడ్డి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): రైతుల అభ్యున్నతికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ధూళికట్ట ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార సంఘం రూ.18 లక్షల డిపాజిట్ల నుంచి రూ.కోటి వరకు సేకరించడం అభినందనీయమన్నారు. విండో పరిధిలో ఎనిమిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని, రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులు, ఆధార్ నంబర్ లేని 5.50లక్షల మందికి రుణమాఫీ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. వీరికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే రుణమాఫీ చేస్తుందని ఆయన తెలిపారు. సన్నవడ్లు క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లిస్తుందని అన్నారు. సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ, తాను బాధ్యతలు చేపట్టాక అవినీతికి ఆస్కారంలేకుండా రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. స్వల్పకాలిక రుణాలను రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్లకు, దీర్ఘకాలిక రుణాలను రూ.6 కోట్ల నుంచి రూ.12 కోట్లకు పెంచామని ఆయన తెలిపారు. విండో పరిధిలోని జూలపల్లి మండలంలో ఉన్న ఐదు గ్రామాల రైతుల కోసం వడుకాపూర్‌లో గోదాం నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ కంది మల్లారెడ్డి, జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, సీఈవో బద్దం రవీందర్‌రెడ్డి, సహకార సంఘం జూనియర్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి, డైరెక్టర్లు పోల్సాని పుల్లారావు, బత్తిని లచ్చయ్య, ఐలయ్య, కన్నం లక్ష్మి, కొమ్ము లక్ష్మి, సమ్మయ్య, భూమయ్య, ఎల్ల మ్మ, భగవంతరావు, మాజీ సర్పంచ్ బాలుసాని పరుశరాములుగౌడ్, బుద్దినేని వామన్‌రావు, గొల్లె భూమేశ్, మేచినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం కాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్, చిత్రంలో ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు దిగంబర్ కాంబ్లే, డానియల్

- చెన్నూరు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు

జ్యోతినగర్(రామగుండం): సుప్రీంకోర్టు తీర్పు, ఎస్సీ వర్గీకరణకు తాము వ్యతిరేకం కాదని చెన్నూరు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు వివేక్, కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ శ్రీలక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన మాల కులబాంధవులు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిగంబర్ కాంబ్లే, టీమ్ జిల్లా అధ్యక్షుడు బద్దం డానియల్ తదితరులతో కలిసి వారు హాజరయ్యారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వివేక్, నాగరాజు మాట్లాడుతూ, కులగణన తర్వాతే దామాషా పద్ధతిన వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. మాలలపై భయంకరమైన దాడి జరుగుతోందని, మందకృష్ణ మాదిగ, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మాదిగలకు మాలలు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తప్పుడు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అప్రదిష్టపాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అన్ని రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుంటూ ఎస్సీ వర్గీకరణపై పోరాడుతామని తెలిపారు. మాలల ఐక్యంతో నవంబర్‌లో హైదారాబాద్ వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. మాల సంఘం నాయకులు గుమ్మడి కుమారస్వామి, ముక్క సుదర్శన్, గుమ్మడి కుమారస్వామి, ముక్క సుదర్శన్, ఆనంద్, జేవీ రాజు, దొంత శ్రీనివాస్, కత్తెర మల్ల రమేశ్, దేవ వెంకటేశం, దామెర నర్సయ్య, రమేశ్, పసుల రామ్మూర్తి, భాస్కర్, నర్సయ్య, జగన్మోహన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని మెరుగుపరుస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- అట్టహాసంగా ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సుల ప్రారంభం



ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభిస్తున్న మంత్రి ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: పదేళ్లలో టీఎస్ ఆర్టీసీ పీకల్లోతు నష్టాల్లోకి కూరుకుపోయిందని, సంస్థను మెరుగుపరుస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్–హైదరాబాద్ (జేబీఎస్) మార్గంలో తిరిగే 35 ఎలక్ట్రిక్ బస్సులను ఆదివారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జెండా ఊపి ప్రారంభించారు. కరీంనగర్‌తో పాటు నిజామాబాద్‌కు 67, వరంగల్‌కు 86, సూర్యాపేటకు 52, నల్లగొండకు 65, హైదరాబాద్‌కు 74 బస్సులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కాలుష్యరహిత సమాజం కోసం హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో దశలవారీగా 2,400 బస్సులు కొనుగోలు చేసేందుకు సంస్థ కసరత్తు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు మెప్మాతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి జిల్లాల్లో 500 ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. మహాలక్ష్మి పథకానికి మహిళల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, 300 రోజుల్లో మహిళలకు 92 కోట్ల జీరో టికెట్లను సంస్థ జారీ చేసిందని, ఫలితంగా రూ.3,123 కోట్లు మహిళలు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. కరీంనగర్ రీజియన్‌లో 2.55 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుని రూ.100 కోట్ల వరకు ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం మంత్రితో పాటు ఆర్టీసీ ఎండీ, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్, కరీంనగర్ నగర మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. అనంతరం కరీంనగర్–2 డిపోకు చేరుకొని చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ముని శేఖర్, సీఎంఈ వెంకన్న, కరీంనగర్ ఆర్ఎం సుచరిత, జేబీఎం ప్రతినిధి చందన్ మిశ్రా పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల ప్రత్యేకతలు

- 12 మీటర్ల పొడవు గల ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు హైటెక్ హంగులతో అందుబాటులోకి వస్తున్నాయి.
- 41 సీట్ల సామర్థ్యంతోపాటు మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉంది.
- నాలుగు సీసీ కెమెరాలు ఉండగా.. వాటికి ఒక నెల రికార్డింగ్ బ్యాకప్ ఉంది.
- గమ్యస్థానాల వివరాల కోసం ఎల్ఈడీ బోర్డులు, అగ్ని ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం (ఎఫ్‌డీఎస్ఎస్) ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఒక్కసారి చార్జింగ్ చేస్తే 300 కి.మీ వరకు ప్రయాణించవచ్చు.
- ఫుల్ చార్జింగ్‌కు రెండున్నర గంటల సమయం పడుతుంది.

సజ్జనార్‌కు మెమొంటో బహూకరణ

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదివారం కరీంనగర్ వచ్చిన సందర్భంగా జిల్లా గాండ్ల తిలకుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తిలకుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, ప్రధాన కార్యదర్శి జక్కం పుల్లయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల కట్టడికి చర్యలు

- గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు



మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): మత్తు పదార్థాల కట్టడికి గోదావరిఖని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలో ఆదివారం తొలిసారి నార్కోటిక్ డ్రాగన్స్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. టూ టౌన్ సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యతన్నారు. కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు బానిసలుగా మారొద్దని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దని ఆయన సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సీఐ అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఇందుకోసం పోలీసుల సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, లేదా డయల్ 100 నంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని టూటౌన్ –2 ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్ఐలు వెంకటేశ్వర్, ఫరీద్, అహ్మదుల్లా, కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ ఆశయాలపై ప్రచారం

పెద్దపల్లిరూరల్: మహాత్మా గాంధీజీ 155వ జయంతి సందర్భంగా జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నామని స్వాతంత్య్ర సమర యోధుల వారుసల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజీతో పాటు కస్తూరిబా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు సంబంధించిన సాహిత్యాన్ని ఈ సందర్భంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బాలికలు కరాటే పోటీల్లో ప్రతిభ చూపారు. హన్మకొండలో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో విద్యార్థినులు బంగారు పతకం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను హన్మకొండ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కరాటే మాస్టర్ సతీశ్ తదితరులు అభినందించారు.

రూ.33 వేల కోట్ల బకాయిలు ఇప్పించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: రాష్ట్రంలో ఉన్నది తమ ప్రభుత్వమే అని ప్రచారం చేసుకుంటున్న ఐఎన్‌టీయూసీ నాయకులు.. సర్కార్ నుంచి సింగరేణికి రావాల్సిన రూ.33 వేల కోట్ల బకాయిలు ఇప్పించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆర్జీ–1 బ్రాంచ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కోలకు సింగరేణి బొగ్గు, విద్యుత్ సరఫరా చేసిందని, గత ప్రభుత్వం బొగ్గు బకాయిలు రూ.12వేల కోట్లు, విద్యుత్ బకాయిలు రూ.17 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.4వేల కోట్ల వరకు బకాయి పడిందని తెలిపారు. ఈ మొత్తం బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలతో సింగరేణి అప్పుల్లో కూరుకుపోయి మనుగడ కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయంపై రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. బకాయిల కోసం తాము ఆందోళనలు చేస్తామన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే గుర్తింపు పత్రం ఆలస్యం

ఐఎన్‌టీయూసీతోనే తమకు గుర్తింపు కార్మిక ధ్రువీకరణ పత్రం ఆలస్యమైందని సీతారామయ్య ఆరోపించారు. ఆరు ఏరియాలు గెలిచిన తమకే గుర్తింపు పత్రం ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ, ఓట్లు ఎక్కువగా వచ్చాయని ఏఐటీయూసీకే గుర్తింపుపత్రం ఇవ్వాలని సింగరేణితో వాగ్వాదం జరగడంతోనే ధ్రువీకరణపత్రం జారీలో ఆలస్యమైందని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఏఐటీయూసీ విజయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేఎస్ పైరవీలకే పరిమితమయ్యాయని విమర్శించారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, సంకె అశోక్, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, ఎంఎ గౌస్ పాల్గొన్నారు.

స్క్రాప్ పాలసీపై స్పష్టత ఇవ్వాలి

- లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి

పెద్దపల్లిరూరల్: లారీ యజమానుల సమస్యలను దృష్టిలో ఉంచుకునే విధి విధానాలను రూపొందించాలని లారీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రస్థాయి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వానికి ఏటా రూ.3,266 కోట్ల ఆదాయం సమకూర్చుతున్న లారీ యజమానుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్క్రాప్ పాలసీ విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించిందన్నారు. 15 ఏళ్లు దాటితేనే స్క్రాప్‌గా మారుస్తామనడం సరికాదన్నారు. పొల్యూషన్ చెక్ చేసి నిర్ణయం తీసుకోవాలని కోరారు. మండలస్థాయిలో స్థానికంగా లారీలను స్వయంగా నడుపుకుని కుటుంబాలను పోషించుకుంటున్న కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆయ ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రమాదకారకులపైనే చర్యలు తీసుకోవాలి

రోడ్లపై లారీలతో ప్రమాదాలు జరిగినపుడు నిజంగా లారీ డ్రైవర్ల తప్పిదం లేకున్నా పెద్దవాహనమనే ఒకే ఒకకారణంతో కేసులు నమోదు చేయడం సరికాదని అంజిరెడ్డి అన్నారు. ఫోర్‌లేన్, డివైడర్లు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలు చాలా వరకు తగ్గాయన్నారు. ప్రధాన రోడ్లపై గుంతలు పడడంతోనే ప్రమాదాలు జరిగితే హెచ్చరిక బోర్డులు ఉంచాలని, నిర్లక్ష్యం చేసే అధికారులపైనే కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నడుమ లోకల్ పర్మిట్ విధానానికి అనుమతివ్వాలని కోరారు. పర్మిట్ల భారం ఎక్కువై ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. ఉత్తరప్రదేశ్, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను దృష్టిలో ఉంచుకుని పన్నులు తగ్గించాలని అన్నారు. లారీ యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు యజమానులంతా ఏకం కావాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, షేక్ అబ్దుల్‌బారీ, బూత్కూరు తిరుపతి, పూదరి శ్రీనివాస్, జహంగీర్, అఫ్జల్, గణేశ్, జవహర్, నాగేశ్వర్‌రావు, సమ్మిరెడ్డి, మధు, నవాజ్, చాంద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముంబయిలో భూషణరావుపేట వాసి మృతి


మైస అమ్మాయి (ఫైల్)

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన మైస అమ్మాయి (55) మహా రాష్ట్రలోని ముంబయిలో అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. అమ్మాయి కొంత కాలంగా కుటుంబసభ్యులతో ముంబయిలో ఉంటోంది. ఆమె అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని భూషణరావుపేట గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అమ్మాయికి భర్త నర్సయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జ్వరంతో బాలిక మృతి


తాలుక మనీషా(ఫైల్)

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన తాలుకా మనీషా (11)జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మనీషా ఏడో తరగతి చదువుతోంది. రెండురోజుల క్రితం జ్వరం రావడంతో జగిత్యాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు బాలిక తల్లిదండ్రులు గంగారెడ్డి, లక్ష్మి తెలిపారు.

గోదావరిలో స్నానాలకు వచ్చి ఒకరి గల్లంతు

- మరో ఇద్దరు సురక్షితం

ధర్మపురి: గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చిన ముగ్గురు యువకుల్లో ఒకరు గల్లంతయ్యాడు. మిగిలిన ఇద్దరిని జాలర్లు సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన ధర్మపురి మండలం రాయపట్నంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం కరీంనగర్ జిల్లాకేంద్రానికి చెందిన పవన్ కుమార్, అక్షయ్, వినీత్ కలిసి సెలవు దినం కావడంతో మండలంలోని రాయపట్నం వద్దగల గోదావరిలో స్నానాల కోసం వచ్చారు. నీటిలో దిగి స్నానం చేస్తుండగా.. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వరదలో కొట్టుకుపోయారు. వీరిలో పవన్ కుమార్ గల్లంతయ్యాడు. వినీత్, అక్షయ్‌ను జాలర్లు బయటకు తీశారు. పవన్ కుమార్ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానితులను పట్టుకున్న కాలనీవాసులు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాయికల్: పట్టణంలోని శివాజీనగర్‌లో బట్టల సేకరణ కోసం తిరుగుతున్న శాంతి, రమేశ్ అనే దంపతులను ఆదివారం కాలనీవాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మోడిచల్‌లో ఆదర్శ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఓల్డేజ్ హోం పేరిట ఆటోలో శాంతి, రమేశ్ అనే దంపతులు కలిసి అనుమానాస్పదంగా పట్టణంలోని కాలనీల్లో తిరిగి బట్టలు సేకరిస్తున్నారు. బీజేపీ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు సురతాన్ని భాగ్యలక్ష్మికి అనుమానం రావడంతో కాలనీవాసుల సహకారంతో పట్టుకున్నారు. దీంతో రమేశ్ అక్కడినుంచి పరారయ్యారు. కాలనీవాసులు ఆరా తీయడంతో అసలు స్వచ్ఛంద సంస్థనే లేదని తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని చేరుకుని శాంతిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై దేవేందర్ నాయక్ తెలిపారు.

సీఎంఆర్ నిబంధనలు కఠినం

- పక్కాగా ఇచ్చేలా ప్రత్యేక అధికారి నియామకం
- అవసరమైతే ఆర్ఆర్ యాక్ట్ అమలు


కరీంనగర్ శివారులోని మిల్లులో మరాడించిన బియ్యం

కరీంనగర్ అర్బన్: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా ఎగనామం పెడదామనుకుంటే కుదరదిక. నిబంధనలను కఠినతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా సాగుతోంది. డిఫాల్టర్లను అవసరమైతే జైలుకు పంపేలా కసరత్తు చేస్తోంది. మొత్తంగా సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టకుండా ఈ సారి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. మిల్లులకు సీఎంఆర్ ధాన్యం కేటాయించే సమయంలోనే మిల్లు యజమానికి, మరో కస్టోడియన్ అధికారికి ధాన్యం బాధ్యతలు అప్పగిస్తారు. వీరిద్దరి అనుమతి లేకుండా సీఎంఆర్ ధాన్యం నిల్వల నుంచి కదలిక లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పౌరసరఫరాల అధికారులు పూర్తిస్థాయిలో కేటాయించిన సీఎంఆర్ ధాన్యానికి నిర్దేశించిన ప్రకారం బియ్యం వచ్చే వరకు వీరి పర్యవేక్షణ ఉండేలా కొత్త నిబంధన తీసుకువస్తున్నారు. ఈ వానాకాలం సీజన్ పంట దిగుబడుల నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది.

బకాయిలకు చెక్

సాధారణంగా ధాన్యం తీసుకున్న మిల్లర్లు 45 రోజుల్లో నిర్దేశించిన మేరకు పూర్తిగా సీఎంఆర్ బియ్యం పెట్టాలి. కానీ దశాబ్దాలుగా కొందరు మిల్లర్లు సీఎంఆర్ ధాన్యం తీసుకుని వాటిని బహిరంగ మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వ ధాన్యంతో కోట్లు గడించి ఇతర వ్యాపారాల్లో భాగస్వాములవుతుండగా ప్రభుత్వానికి శఠగోపం పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవ్వాల్సిన బియ్యం రెండుమూడు సంవత్సరాలైనా ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండగా జిల్లాలో ఇలాంటి వారు పదుల సంఖ్యలో ఉండటం విశేషం. రాజకీయ ఒత్తిళ్లకు తోడు మామూలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా నుంచి సుమారు రూ.200 కోట్లకు పైగా బియ్యం బకాయిలు పడగా ఇటీవల ప్రభుత్వం కొందరిని అరెస్టు చేసి రకరకాలుగా మిల్లర్ల మీద ఒత్తిడి తీసుకువచ్చి కొంత మేరకు రాబట్టగలిగినా ఇంకా బకా యిలు రూ.కోట్లల్లో ఉన్నాయి. కొందరు మిల్లర్లు రెండు, మూడు సీజన్‌లు వచ్చినా ఆ ధా న్యాన్ని వాడుకుని తరువాత సీఎంఆర్ బియ్యం పెడుతున్నారు. ఇకపై సదరు పరిస్థితి తలెత్తకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక అధికారితో గ్యారంటీ

అధికారిని బాధ్యుడిని చేయడం వల్ల తమ ధాన్యానికి గ్యారంటీ ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మిల్లులో ధాన్యం నిల్వ ఉంటే సీఎంఆర్ బియ్యం సేకరణ చేయడం కూడా సులభతరం అవుతుందని అధికారులు అంటున్నారు. ఒక వేళ కస్టోడియన్ అధికారికి తెలియకుండా ధాన్యం పక్కదారి పట్టిస్తే ఆ అధికారి తన తనిఖీలలో గుర్తిస్తారు. కాబట్టి వెంటనే మిల్లరుపై నిత్యావసర వస్తువుల దుర్వినియోగం కింద క్రిమినల్ కేసు నమోదు చేసి వాటిని రాబట్టేందుకు చర్యలు తీసుకుంటారు. అంతే కాకుండా నిల్వ చేసిన ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం, నాణ్యత చెడిపోకుండా చూసుకుంటూ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకునేలా నిబంధనలు ఉండనున్నాయి.

కొడుకు చేతిలో తండ్రి హతం


మామిండ్ల మల్లయ్య మృతదేహం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్

- వేములవాడలో పట్టపగలే హత్య
- ఆస్తి తగాదాలే కారణం
- సవతితల్లిపై అటాక్
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు


మామిండ్ల మల్లయ్య (ఫైల్)

వేములవాడ: ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన తగాదాలో తండ్రి మామిండ్ల మల్లయ్య(57)ను మొదటి భార్య బాలవ్వ కుమారుడు రాజు దాడి చేసి హతమార్చిన ఘటన వేములవాడలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో నివాసముంటున్న మామిండ్ల మల్లయ్యకు ఇద్దరు భార్యలు బాలవ్వ, పద్మ. మొదటి భార్య బాలవ్వ కొన్నేళ్ల క్రితం మరణించింది. ఆమెకు ముగ్గురు బిడ్డలు, ఒక కుమారుడు. మొదటి భార్య మరణించడంతో మ ల్లయ్య పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. పద్మకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. రెండో భార్యతో చెక్కపల్లిరోడ్డులోని తన నివాసంలో ఉంటున్నాడు. మొదటి భార్య సంతానం మరోచోట నివాసముంటున్నారు. మల్లయ్యకు ఆస్తి పంపకాల విషయంలో రాజుతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ఆస్తి పంపకాల విషయంలో కులసంఘంలో పంచాయితీ జరిగింది. రెండో భార్య కూతుళ్ల వివాహం జరిగే వరకు ఆస్తి పంపకాలు చేపట్టనంటూ మల్లయ్య తెగేసి చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మల్ల య్య ఇంటికి చేరుకున్న వీరు బెడ్రూమ్‌లో గొడవకు దిగారు. మాటమాట పెరిగి రాజు తన సవతి తల్లి పద్మపై కత్తితో దాడి చేయడంతో తండ్రి అడ్డుపడ్డాడు. పెనుగులాట పెరగడంతో వాకిట్లోకి చేరుకున్న మల్లయ్య, పద్మలపై రాజు, అతని బావలు సైకిల్, బండ రాళ్లతో దాడిచేసినట్లు మల్ల య్య కూతురు తెలిపింది. తీవ్రంగా గాయపడ్డ మల్లయ్య ను 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లయ్య మరణించగా, పద్మ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది.

సెల్‌ఫోన్ ధ్వంసం

ఈ గొడవను మల్లయ్య కూతుళ్లు, తల్లి పద్మ మొబైల్‌లో రికార్డు చేస్తుండడంతో గమనించిన రాజు దాన్ని పగులగొట్టినట్లు కూతురు చెబుతోంది. మల్లయ్య హత్యోదంతం పట్టణంలో కలకలం రేపింది.

ఆస్తి తగాదాలే హత్యకు కారణం

మామిండ్ల మల్లయ్య హత్యకు ఆస్తి తగాదాలే కారణమని వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మల్లయ్య రెండో భార్య పద్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఆస్తి తగాదాలతోనే మొదటి భార్య కుమారుడు, అల్లుళ్లు దాడికి పాల్పడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్‌తో కలిసి పరిశీలించారు. – శ్రీనివాస్, రూరల్ సీఐ

శరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

- తొమ్మిది రోజులపాటు అమ్మవారికి విశేష పూజలు
- ముస్తాబైన రామలింగేశ్వర స్వామి ఆలయం


ధర్మపురిలో శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వర ఆలయం

ధర్మపురి: దసరా నవరాత్రి ఉత్సవాలకు ధర్మపురిలోని ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీశారద శంకరాచార్యుల వారికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించే శరన్నవరాత్రోత్సవాలకు ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ప్రత్యేక పూజలు ఇలా..

మూడో తేదీ: ఎరుపువర్ణ వస్త్రధారణలో అమ్మవారు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనం
నాలుగున: పసుపు వర్ణ వస్త్ర ధారణలో బ్రహ్మచారిణి రూపంలో దర్శనం
ఐదున: గులాబీ వర్ణ వస్త్రధారణలో చంద్రఘంటా రూపంలో దర్శనం
ఆరున: గోధుమ రంగు వస్త్రధారణలో కూష్మాండ, శాకాంబరి రూపంలో దర్శనం
ఏడున: పసుపువర్ణ వస్త్రధారణలో స్కందమాత రూపంలో దర్శనం
ఎనిమిదిన: ఆకుపచ్చ రంగు వస్త్రధారణలో కాత్యాయిని రూపంలో దర్శనం
తొమ్మిదిన: చిలుకపచ్చ వర్ణ వస్త్రధారణలో కాళరాత్రి రూపంలో దర్శనం
పదిన: తెలుపువర్ణ వస్త్రధారణలో మహాగౌరి రూపంలో దర్శనం
11న: ఎరుపురంగు వస్త్ర ధారణలో సిద్ధిధాత్రి రూపంలో దర్శనం
(చండీహోమం, బలిహరణ, పూర్ణాహుతి తదితర పూజలు ఉంటాయి)
12న: విజయ దశమి సందర్భంగా శమీవృక్షానికి పూజలు చేస్తారు

నేడు రైతులకు రాజన్న కోడెల పంపిణీ

వేములవాడ: వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించుకునే నిజకోడెలను గతంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన హిందూ రైతులకు సోమవారం రెండో విడత ఉచితంగా పంపిణీ చేయనున్నారు. తిప్పాపూర్‌లోని గోశాలలో ఉదయం 10.30 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పశుసంవర్ధకశాఖ అధికారులు, ఆలయ అధికారులు హాజరవుతారని వివరించారు.

ఫోక్ సింగర్‌పై లైంగిక దాడి కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో సాంస్కృతిక సారథి ఉద్యోగి, ఫోక్ సింగర్ సింగారపు మల్లేశం అలియాస్ మల్లిక్ తేజపై లైంగికదాడి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన ఫోక్‌సింగర్, రైటర్ అయిన యువతి, బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి మల్లిక్ తేజ కలిసి జగిత్యాల జిల్లాకేంద్రంలో కొద్దికాలంగా ఎంవీ మ్యూజిక్ స్టూడియో నడిపిస్తున్నారు. కొద్దిరోజులుగా తనను భయభ్రాంతులకు గురిచేస్తూ లైంగిక దాడి చేస్తున్నాడని యువతి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో మల్లిక్‌తేజపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారం, నగదు అపహరణ


దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన ముసిపట్ల ఉదయ్‌కుమార్ ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. వెంకటాద్రి నగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్ శనివారం ఇంటికి తాళం వేసి పెద్దపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలు, తాళం పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి మూడు తులాల బంగారు గొలుసు, తులం పుస్తెలు, రూ.55వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, పట్టణ ఎస్సై మన్మథరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హార్వెస్టర్ పరికరాలకు వెళ్లి దుర్మరణం

- కారు, మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


స్వామినాయక్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామశివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మరిఖాన్‌పేట తండాకు చెందిన అజ్మీర స్వామినాయక్(40) మృతి చెందగా, పెర్కపల్లి గ్రామానికి చెందిన గాదం రవి తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్ఐ జలీల్ అహ్మద్ కథనం ప్రకారంగా.. స్వామినాయక్ తన హార్వెస్టర్ డ్రైవర్ గాదం రవితో కలిసి మోటార్ సైకిల్‌పై హార్వెస్టర్‌కు అవసరమైన పరికరాలు కొనుగోలుచేసి తీసుకురావటానికి ధర్మారం వస్తున్నారు. ఎర్రగుంటపల్లి గ్రామశివారులోకి రాగానే ఎదురుగా కరీంనగర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకింది. ఈ సంఘటనలో స్వామినాయక్, రవి కిందపడి తీవ్రం గాయపడ్డారు. స్థానికులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామినాయక్ మృతి చెందాడు. గాదం రవి కాలు విరిగింది.మృతుడి సోదరుడు అజ్మీర నర్సనాయక్ ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న ఎర్రోజు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

దేవీనవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



3 నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రోత్సవాలకు సిద్ధమవుతున్న వేదిక, వాహనాలు


ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

- రాజన్న ఆలయంలో నిత్యకల్యాణాలు రద్దు

వేములవాడ: రాజన్న సన్నిధిలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు పది రోజులపాటు దేవీనవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బాలత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయం ఎదుట వేదిక సిద్ధం చేశారు. స్వామి వారి ఊరేగింపునకు ఉపయోగించే రకరకాల వాహనాలను ఆదివారం శుభ్రం చేయించారు. ఆలయ గోపురాలకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ఈనెల 9న మూలనక్షత్ర పుస్తకరూపిణి మహాసరస్వతి పూజ, 10న దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి చండీకలశప్రతిష్ఠ, చండీ సప్తశతీహవనం, రాత్రి 8 గంటలకు మహిషాసురమర్దని అమ్మవారికి మహాపూజ, 11న పూర్ణాహుతి, 12న విజయదశమి సందర్భంగా ఆయుధపూజ, స్వామివారి పెద్దసేవలపై శమీపూజ నిర్వహించనున్నట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి వివరించారు. పది రోజులపాటు నిత్య కల్యాణాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

- చేదబావిలో పడి బాలుడి మృతి


నందకుమార్ (ఫైల్)


బాలుడిని పరీక్షిస్తున్న వైద్యులు

పెద్దపల్లిరూరల్: ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలోని చేదబావిలో పడి మడిపల్లి నందకుమార్(6) మృతి చెందాడు. పెద్దపల్లి పట్టణంలోని బండారికుంటకు చెందిన మడిపల్లి కరుణాకర్ – సంధ్య దంపతులకు ఉన్న ఒక్కగానొక్క కుమారుడు.. ఆదివారం ఆడుకుంటూ వెళ్లి ఇంట్లో ఉన్న చేదబావిలో పడిపోయాడు. బాబు అరుపులు విని స్థానికులు వచ్చి బాలుడిని వెలికితీశారు. ఆ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు నందకుమార్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. 'ఆరేండ్లకే నీకు నూరేండ్లు నిండాయా కొడుకా..' అంటూ తల్లి రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రాజన్న సేవలో శృంగేరిపీఠం శిష్య బృందం

- వేములవాడలో 108 అడుగుల ఆది శంకరుల విగ్రహ ప్రతిష్ఠ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శృంగేరిపీఠం శిష్యబృందం, ఆలయ అధికారులు

వేములవాడ: తెలుగు రాష్ట్రాల శృంగేరిపీఠం సంచాలకులు పసర్లపాటి బంగారయ్యశర్మ ఆదివారం రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిశంకరుల విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అగ్రహారం గుట్టల ప్రాంతంలో 108 అడుగుల ఎత్తయిన ఆది శంకరుల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తి గల వారు రూ.108 చెల్లించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రొటోకాల్ ఏఈవో రమేశ్‌బాబు, పర్యవేక్షకులు తిరుపతిరావు, అశోక్ ఉన్నారు.

రాజన్నకు మొక్కులు


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, కోడె మొక్కు, నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు.


రాజన్న దర్శనం కోసం క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

- ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి
- ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ సైకిల్‌పోలో విజేతలకు బహుమతులు ప్రదానం


గెలుపొందిన విద్యార్థులతో పోటీల నిర్వాహకులు, అధ్యాపకులు, టీచర్లు, తదితరులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

గంగాధర(చొప్పదండి): క్రీడలతో శారీరక, మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెరుగుతుందని ఎస్ ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి అన్నారు. మండలంలోని రంగరావుపల్లి గ్రామం ఎస్ఆర్ ప్రైమ్ విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ సైకిల్‌పోలో చాంపియన్‌షిప్ –2024 పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, యువత మొబైల్స్, టీవీలు చూడటం తగ్గించి నచ్చిన క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు సబ్ జూనియర్స్, జూనియర్స్ బాయ్స్, గర్ల్స్, సీనియర్ మెన్, ఉమెన్స్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్సా ర్ విద్యాసంస్థల డీన్ రవీందర్ రెడ్డి, ప్రిన్సి పాల్లు ప్ర వీణ్‌రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ సైకిల్‌పోలో అసో షియేషన్ చైర్మన్ సత్యనారాయణ, అధ్యక్షుడు జీవరత్నం, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ నిరంజన్ పాల్గొన్నారు.